
సాక్షి బాపట్ల

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



వేంకటేశ్వరస్వామి వ్రతాలు

వినుకొండ(నూజెండ్ల): మాఘమాసం సందర్భంగా శ్రీనివాస నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వ్రతాలు నిర్వహించారు.



శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ జ్యోతి ఊరేగింపు

నకరికల్లు: స్థానిక గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారి జ్యోతి ఊరేగింపు మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు వార్లు బోసి మొక్కులు చెల్లించారు.

నెల్లెమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ట



చెరుకుపల్లి: మండలం పరిధిలోని ఆరుంబాక గ్రామంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నెల్లెమ్మ తల్లి, ముత్యాలమ్మ, పోతురాజు స్వామి వార్ల విగ్రహాలను ఘనంగా ప్రతిష్టించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మత్స్యకార రాష్ట్ర సర్వసభ్య సమావేశాలు



బాపట్ల: రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి సమావేశాలు శని,ఆదివారాలలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్ తెలిపారు. ఈమేరకు సమావేశాల కరపత్రాలను సంఘం కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. మత్స్యకార గ్రామాల్లో 9 సూత్రాల ఆధారంగా సంఘం పనిచేస్తుందని మహేష్ పేర్కొన్నారు. సమావేశాల్లో నాయకులందరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి మానసీయ హరికుమార్‌రెడ్డి, ఆదరణీయ మురళీధర్జి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దంపతులు పీఠలపై కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజారులు వేద మంత్రోచ్ఛారణలతో మంగళధారణ కార్యక్రమం నిర్వహించి, స్వామి వారి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గుండాటలో ఘర్షణ.. పోలీసుల లాఠీచార్జి

ఒకరికి తీవ్ర గాయాలు

మాచవరం: గురజాల నియోజకవర్గం మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా బొబ్బాయి (గుండాట) నిర్వహణ పోలీసుల లాఠీచార్జికి దారి తీసింది. తెలిసిన వివరాల ప్రకారం.. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారిలో గుండాట నిర్వహిస్తున్నారు. తోపులాటలో ఓ వ్యక్తి గుండాట బల్లపై పడడంతో నిర్వాహకులకు అక్కడ ఉన్న వ్యక్తుల మధ్య వివాదం నెలకొంది. ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కె.సతీష్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లాఠీచార్జి చేసి, చెదరగొట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యార్డులో 93,597 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 84,278 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 93,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 65,583 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పొగ చూరిన ఆశలు

- జిల్లాలో నాలుగింతలు పెరిగిన పొగాకు సాగు
- సాగుతోపాటు భారీగా పెరిగిన కౌలు, కూలి ధరలు
- మార్కెట్‌లో ఆశించిన ధర లేక రైతుల ఆందోళన



దిగుబడితో విస్తారంగా ఉన్న పొగాకు పందిరి

పర్చూరు(చినగంజాం): జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం గతేడాది కంటే ఈ ఏడాది నాలుగింతలు పెరిగింది. మిరప, పత్తి, శనగ, మొక్కజొన్న వంటి పంటలతో ఆర్థికంగా ఇబ్బందులు పడిన రైతులు గతేడాది పొగాకు లాభాలు ఆర్జించి పెట్టడంతో ఆ పంట సాగు వైపు ఆసక్తి కనబరిచారు. పెట్టుబడి, ఖర్చులు తక్కువగా ఉండి, సస్యరక్షణ చర్యలతో ఇబ్బంది లేకపోవడంతో రైతులు అధికంగా సాగుకు ముందుకు వచ్చారు. వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు సాగు విస్తృతంగా చేపట్టారు. ధర అనుకున్నంత రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడులు అయినా రాకపోతాయా అనే ఆశతో ఉన్నారు. జిల్లాలో మొత్తం 57 వేలు పైగా ఎకరాల్లో ఈ ఏడాది పొగాకు సాగు చేపట్టగా పర్చూరు డివిజన్ పరిధిలో 25 వేల ఎకరాల్లో సాగు చేపట్టడం గమనార్హం.

అనూహ్యంగా పెరిగిన సాగు

గతేడాది మిరప పంట వేసిన రైతులు తుఫాన్‌లు కారణంగా తీవ్రంగా నష్టపోవడం, అదే సమయంలో పొగాకు సాగు చేసిన రైతులు ఊహించని విధంగా అధిక ధర పలికి మంచి ఆదాయాన్ని ఆర్జించారు. ఫలితంగా ఈ ఏడాది అధిక సంఖ్యలో రైతులు పొగాకు సాగు చేపట్టారు. బాపట్ల జిల్లాలో సాధారణంగా పొగాకు సాగు విస్తీర్ణం సుమారు 17 వేల ఎకరాలు ఉండగా ఈ ఏడాది అనూహ్యంగా 57 వేల ఎకరాలకు పెరిగింది. తక్కువ పెట్టుబడి, నీటి సమస్య లేకపోవడం, కూలీల భారం తక్కువగా ఉండటంతోపాటు పురుగుమందులు అధికంగా ఉపయోగించాల్సిన అవసరం లేకపోవడంతో రైతులు పొగాకు సాగు వైపు దృష్టి సారించారు.

గత ఏడాది క్వింటా రూ.15,500

గతేడాది బ్లాక్ బర్లీ పొగాకు దిగుబడి 18 నుంచి 20 క్వింటాళ్లు రాగా, క్వింటా ధర రూ.15,500 పలికింది. ఎకరాకు రైతుకు రూ.3 లక్షలు వరకు మార్కెట్ ధర రాగా పెట్టుబడి, ఖర్చులు పోను రూ.1.60 లక్షలు లాభాలు వచ్చాయి. వైట్ బర్లీ పొగాకు ఎకరాకు 16 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర గరిష్టంగా రూ.18 వేలు వరకు పలికింది. పెట్టుబడి, ఖర్చులు పోను ఎకరాకు రూ.1.50 లక్షలు మిగిలాయి. వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేయడంతో రైతులు విపరీతంగా లాభాలు ఆర్జించారు.

పెరిగిన కౌలు ధరలు

జిల్లాలో పొగాకు సాగు అధికంగా సాధారణ విస్తీర్ణం కన్నా నాలుగింతలు పెరగడంతో భూమి కౌలు రేట్లు, కూలీ రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఎకరా సాగుకు సుమారూ రూ.1.50 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోంది. సాగు పట్ల రైతులు ఆసక్తిని గమనించిన భూ యజమానులు కౌలు రేట్లు పెంచేశారు. గతంలో రూ.25 వేలు పలికిన ఎకరా కౌలు రూ.35 వేల నుంచి రూ.40 వేలు పలుకుతోంది. పంట అమ్ముడు పోయి కౌలు కోసం వేచి ఉంటే రూ.40 వేలు అన్నమాట. ఇకపోతే రైతులు నారు పోసే దగ్గర నుంచి సస్యరక్షణ చర్యలు చేపడుతూ ఎరువులు, పురుగుమందులు వాడుతూ పంట చేతికందివచ్చే వరకు కాపాడుకోవాలి. నారు, దున్నడం, నాట్లు, ఆకు కొట్టడం వంటి పనులకు మొత్తం కలిపి రూ.1.50 లక్షలు అవుతుంది. సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. గతంలో రూ.600 కూలీ ఒక్కసారిగా రూ.1100 పెంచేశారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.10 వేలు మించి లేదని, గతేడాది రూ.10 వేలు నుంచి రూ.12 వేలు పలికిన గుల్ల పొగాకు ఈ ఏడాది రూ.5 వేలుకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఈ ఏడాది నష్టాలే



గతేడాది నాలుగు ఎకరాల్లో సాగు చేశా. క్వింటా సరాసరి రూ.15 వేలు వరకు ఉండటంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది ఏడు ఎకరాలు సాగు చేశా. ప్రస్తుతం ధర పూర్తిగా పతనమయింది.

–గొట్టిపాటి వెంకట్రావు, యద్దనపూడి

ధర కలిసొస్తేనే ఆదాయం



గతేడాది 20 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. మంచి ధర ఉండటంతో తిరిగి ఈ ఏడాది కూడా సాగు చేశా. ఏడాది కూలీ రేట్లు, కౌలు రేట్లు పెరిగాయి.

–గనిపిశెట్టి వెంకట్రావు, చిమటావారిపాలెం.

రెడ్‌బుక్ రాజకీయాలు చెల్లవు

- నాగేశ్వరరావు కుటుంబానికి అండగా నిలుస్తాం
- న్యాయ పోరాటానికి సిద్ధం
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున

అద్దంకి: సంతమాగులూరు మండలం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఊట్ల నాగేశ్వరరావు కుటుంబానికి తాము అండగా నిలుస్తామని ఆ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సమస్యను పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంతో ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ మండల అధ్యక్షుడికే రక్షణ లేకుంటే సామాన్యులకు ఏం మేలు జరుగుతుందని ప్రశ్నించారు. స్వయంగా ఒక వ్యక్తి తనకు ప్రాణహాని ఉందని మీడియా ముందు బహిరంగంగా చెప్పుకోవడం చూస్తే ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మంత్రి ఇలాకాలోనే ఇలా జరిగితే రాజకీయాలు ఎటువైపు పయనిస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు పనిచేయడం సబబు కాదన్నారు. నాగేశ్వరరావు విషయమై ఎస్పీతో తాను మాట్లాడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్, పసుపు బుక్ రాజకీయాలు చేస్తే ప్రజలు మీకు రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతారన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటికే ఒక దళిత రైతును కూటమి ప్రభుత్వం బలి తీసుకుందని తెలిపారు. ఆ రైతు తన భూమిని టీడీపీ నేతలు అక్రమించకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఒక దళిత రైతు మీ అకృత్యాలకు బలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే నియోజకవర్గంలో మరి కొన్ని సంఘటనలు జరిగాయన్నారు. నాగేశ్వరరావు విషయాన్ని మా అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. మా ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సామాన్యులను ఇబ్బందులకు గురిచేయకుండా, ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చే దిశగా పనిచేయాలని హితవు పలికారు. నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ అద్దంకి ప్రాంతానికి మంచి చేయాల్సిన మంత్రి ఆయన పీఏ సారథిని పురిగొల్పి వైఎస్సార్ సీపీని దెబ్బ తీయాలని చూస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మూకుమ్మడిగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి రాజ్‌కుమార్, అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, సంతమాగులూరు మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునుపూడి రఘురామగుప్తా, బల్లికురవ మండల అధ్యక్షుడు కృష్ణ, కొరిశపాడు మండల అధ్యక్షుడు పాలపర్తి శ్రీధర్(చిట్టి) ఐదు మండలాల నాయకులు, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

రెండు నిండు ప్రాణాలు తీసిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి కారణమైన బస్సు

రాజుపాలెం: అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బీభత్సం సృష్టించింది. రెండు ద్విచక్ర వాహనాలను, రెండు కార్లను ఢీకొంది. దీంతో ఓ ద్విచక్ర వాహనంపై ఉన్న ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గుంటూరు నుంచి మాచర్లకు అతి వేగంతో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన సానికొమ్ము సుబ్బారెడ్డి(42), దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి(42)లు ద్విచక్ర వాహనంపై క్రోసూరు మండలం పీసపాడు గ్రామంలో జరిగే పెళ్లికి వెళుతున్నారు. ఆర్టీసీ బస్సుకు ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి




మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

సమీక్ష సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం డీపీఓ కార్యాలయంలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బంది పని తీరు మరింత మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ గస్తీ విధులు మరింత పటిష్టం చేయాలన్నారు. దర్యాప్తు అధికారి పోక్సో, మహిళ సంబంధిత కేసుల్లో 60 రోజుల్లోపు దర్యాప్తు పూర్తిచేసి సంబంధిత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయాలన్నారు. కేసుల పురోగతికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సి.సి.టి.ఎన్.ఎస్‌లో అప్లోడ్ చేయాలన్నారు. కేసుల దర్యాప్తులో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమన్నారు. గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో పట్టుబడిన వారిపై నిఘా ఉంచాలన్నారు. వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వారి వినతులకు సంబంధించిన దస్త్రాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చెయ్యాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పై ఉండే మైనర్ పీఆర్‌లు, ఓఈలు సకాలంలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్నారు. పోలీస్, డీపీఓ అధికారులు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏ.ఓ శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ విజయసారథి, డీసీఆర్‌బి సీఐ బాలమురళీకృష్ణ, ఎస్‌బి సీఐ నారాయణ, విక్టర్, స్పందన సెల్ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ జయకుమార్, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్, ఏ సెక్షన్ సూపరింటెండెంట్ కరీముల్లా, కాలేషా వలి తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల పక్కా పన్నాగం

- ప్రజలను వంచించేందుకు నెల కిందటే ప్రణాళిక వేసిన పుల్లారావు
- చిట్ ఫండ్ కంపెనీ డైరెక్టర్ పదవికి కొడుకుతో రాజీనామా
- రెండు నెలల్లో ప్రజల నుంచి సుమారు రూ.70 కోట్ల వరకు వసూలు
- కేసు నమోదులో పోలీసుల అలసత్వం పైనా విమర్శలు
- రికార్డులు తారుమారు చేసిన తర్వాత కార్యాలయం సీజ్ చేసిన పోలీసులు
- పుల్లారావు అరెస్ట్‌లోనూ నిర్లక్ష్యమే
- అజ్ఞాతం నుంచి లొంగుబాటు వరకు కీలకంగా వ్యవహరించిన బంధువైన ఓ సీఐ



నరసరావుపేటలోని సాయిసాధన చిట్‌ఫండ్ కార్యాలయం

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేటటౌన్: పల్నాడు జిల్లా నరసరావుపేటలో కొద్దిరోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సాయిసాధన చిట్ ఫండ్ వ్యాపారి పాలడుగు పుల్లారావు ఉదంతం సస్పెన్స్ థ్రిల్లర్‌ను గుర్తు చేస్తోంది. లక్కీ భాస్కర్ సినిమాలో మాదిరిగా ప్రతిదీ ముందస్తు ప్రణాళికతో ప్రజలను ముంచేందుకు ఆ వ్యాపారి కుటుంబం వేసిన ఎత్తుగడ అధికారులను షాక్‌కు గురిచేసింది. వందల కోట్ల రూపాయలను నమ్మకంగా వసూలు చేసిన వ్యాపారి కుటుంబం బోర్డు ఎత్తేసేందుకు రెండు నెలల కిందటే పథకం పన్నినట్టు తెలుస్తోంది. ఆస్తులు, అంతస్తులను లేనివి ఉన్నట్లు భ్రమ కల్పించి, నెల రోజుల్లో రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు అప్పులు, చిట్‌ల రూపంలో వసూలు చేయడం వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది. అసలు ఆ వ్యాపారి వేసిన పక్కా ప్లాన్ గురించి తెలిసి కంగుతిన్నారు.

దొరికినంత లాగేద్దాం...



పుల్లారావు (ఫైల్)

నెల కిందట పక్కా ప్లాన్ వేసుకున్న వ్యాపారి కుటుంబం తన నమ్మకానికి మరింత పదును పెట్టారు. కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న అధునాతన భవనం, ఇతర వాణిజ్య సముదాయాలను బ్యాంక్ తనఖాలో ఉన్న విషయాన్ని చెప్పకుండా ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపి ఎంత వస్తే అంత అప్పుల రూపంలో లాగేశాడు. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ప్రజల వద్ద సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఈ మధ్య కాలంలోనే వసూలు చేశారు. వీరికి అధిక వడ్డీని ఎరగా వేశారు. నిర్వహించే చీటీ పాటలకు నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఎటువంటి అనుమతి పొందకుండా అక్రమంగా నగదు లావాదేవీలు చేశాడు. బ్రోకన్ చిట్‌ల పేరుతో సభ్యులను పరిమితికి మించి చివరి నాలుగైదు నెలల్లో చేర్చుకొని భారీ మొత్తంలో వారి చేత డబ్బులు కట్టించుకున్నాడు. ఇలా దొరికినంత వరకు ప్రజల వద్ద లాగేసిన అప్పులు, చీటీలు కలిపి సుమారు రూ.400 కోట్లు ఉంటుందని బాధితులు లెక్కలు చెబుతున్నారు. వ్యాపారి నైజం తెలిశాక అప్పులిచ్చిన వారు పోలీసుస్టేషన్ల వద్దకు వెళ్లి కన్నీరు పెట్టుకుంటున్నారు.

ఇదీ ప్లాన్..

25 సంవత్సరాలుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి, అప్పు ఇస్తే అతనికే ఇవ్వాలనిపించేలా మభ్యపెట్టిన వ్యాపారి.. ప్రజల సొమ్మును కాజేసేందుకు పక్కా కుట్ర పన్నారు. చేసిన వ్యాపారాల్లో నష్టమొస్తేనో, కాలం కలిసి రాక చేతిలో డబ్బులు, ఆస్తులు ఖాళీ అయి అప్పులపాలైతేనో ఐపీ పెట్టడానికి సిద్ధమవుతారు. కానీ ఈ వ్యాపారి మాత్రం ఒక పథకం ప్రకారం ప్రజలను నిండా ముంచాడు. రెండు రోజుల కిందట పోలీసులు ఆ వ్యాపారికి చెందిన సాయిసాధన చిట్ ఫండ్ కంపెనీలో సోదాలు చేయగా షాక్‌కు గురయ్యారు. పుల్లారావు కుమారుడు పవన్‌కుమార్ చిట్‌ఫండ్ డైరెక్టర్‌గా వ్యవహరించే వాడు. అయితే నెల కిందటే డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు తనిఖీలకు వెళ్లిన అధికారులు గుర్తించారు. పది రోజుల కిందట వ్యాపారి కుటుంబ సభ్యులు మూటాముల్లె సర్దుకుని నగదు బ్యాగులతో వెళుతున్న వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటన్నింటినీ బట్టి చూస్తే వ్యాపారి కుటుంబం ముందస్తు ప్లాన్‌తో ప్రజల నెత్తిన కుచ్చుటోపీ పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

పోలీసుల తీరుపైనా విమర్శలు

రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాఫిక్‌గా మారిన రూ.400 కోట్లతో పరారైన వ్యాపారి ఉదంతంలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుల్లారావు ప్రజల సొమ్ము పోగేసుకొని కుటుంబంతో సహా పది రోజుల కిందటే ఉడాయించాడు. తన వద్ద రూ.2.80 కోట్లు కట్టించుకొని పుల్లారావు మోసం చేశాడని పరారైన రెండో రోజు మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. తీవ్ర ఒత్తిడి అనంతరం మూడు రోజుల తరువాత కేసు నమోదుచేశారు. నిందితుడిని పట్టుకొనేందుకు పోలీసులు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఈక్రమంలో తాపీగా గుంటూరులోని పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన మరో చీటింగ్ కేసులో పుల్లారావు కోర్టులో గురువారం లొంగిపోయాడు. దీంతో పుల్లారావును పట్టుకొచ్చి తమకు న్యాయం చేస్తారన్న బాధితుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. కేసు నమోదైన వారం తరువాత చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయాన్ని సీజ్‌చేశారు. ఈలోగా కార్యాలయంలో ఉన్న సాక్ష్యాధారాలను పుల్లారావు అనుచర వర్గం తారుమారు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు పుల్లారావు పరారైనప్పటి నుంచి కోర్టులో లొంగిపోయే వరకు అతని సమీప బంధువైన ఓ సీఐ అందర్నీ మేనేజ్ చేసినట్టు తెలుస్తోంది. ఆ సీఐపై బాధితులు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో పుల్లారావు లొంగిపోయేలా చేశాడని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంపై ఇప్పటికైనా దృష్టిపెట్టి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రంగంలోకి టీడీపీ నేతలు

ఇది ఇలా ఉండగా అధికార పార్టీకి చెందిన పుల్లారావును రక్షించేందుకు టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. కమిటీ పేరుతో పదిరోజులుగా కాలయాపన చేస్తూ పుల్లారావుకు ఉన్న ఆస్తులను మూడింతలు పెంచి బాధితులకు అన్యాయం చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

తీరంలో గల్ పక్షుల సందడి







సూర్యలంక తీరంలో ఆహారం కోసం ఎదురు చూస్తున్న గల్ పక్షులు

బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరంలో గల్ పక్షులు సందడి చేస్తున్నాయి. ఇది చూసి పర్యాటకులు ముగ్ధులవుతున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన ఈ పక్షులు నవంబర్ మొదటి వారంలో అక్కడ బయలుదేరి ఫిబ్రవరి మాసంలో ఇక్కడకు చేరుకుంటాయి. ఫిబ్రవరి మాసం ముగిసేంతవరకు ఈ పక్షులు తీరం వెంబడి ఉన్నటువంటి మడచెట్లు, అనువైన ప్రదేశాల్లో గుడ్లు పెట్టి పొదిగి పిల్లలను చేస్తాయి. పిల్లలు స్వచ్ఛందంగా ఎగిరేంత వరకు ఇక్కడే ఉండి తరువాత తిరిగి ఆస్ట్రేలియా ఖండానికి వెళుతుంటాయి. ప్రతి ఏడాదీ ఈ సీజన్‌లో తీరానికి చేరుకునే గల్ పక్షులను వీక్షించేందుకు పర్యాటకులు తీరానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. ఐల వలల్లో చేపలు పడినప్పుడు వాటిపై వాలి మత్స్యకారులను కనువిందు చేస్తుంటాయి.

–బాపట్ల

క్లుప్తంగా

పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

బాపట్ల: పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంటేశ్వరరావు పేర్కొన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. పెన్షనర్లకు ఒకటో తేదీన పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. పెన్షనర్లకు ఉచితంగా వైద్య సేవలు అందించటంతోపాటు అన్ని హాస్పటల్స్‌లో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పీఆర్‌సీ బకాయిలను కూడా విడుదల చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు చెరుకూరి సుబ్బారావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కె.నరసింహారెడ్డి, రాష్ట్ర సంఘం అడిషనల్ కార్యదర్శి రామానుజరావు, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇషాక్, ఉపాధ్యక్షులు ఎస్.ప్రసాద్‌రావు, ఎస్‌బీఐ మేనేజర్ ఆనందబాబు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా నేత వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన బీజేపీ నాయకులు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా బీజేపీ మహిళా అధ్యక్షురాలు రావిపాటి కాశీకుమారి, ఆమె భర్త విష్ణువర్ధన్ శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల, పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

టీడీపీ ఇరువర్గాలతో మాట్లాడిన జాయింట్ కలెక్టర్

చీరాల: స్థానిక గడియార స్తంభం ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు విషయమై ఎవరు ఎన్ని రాజకీయాలు చేసినా అడ్డుకోవాలని ప్రయత్నించినా విగ్రహాన్ని పెట్టి తీరుతానని మాజీ మంత్రి పాలేటి రామారావు స్పష్టం చేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయదల్చుకున్న ఇరువర్గాలతో శుక్రవారం చీరాల ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై గడచిన మూడు రోజులుగా టీడీపీలోని మాజీ మంత్రి పాలేటి రామారావు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వర్గీయుల మధ్య వివాదం నడుస్తున్న క్రమంలో విగ్రహం ఏర్పాటు చేయదలచిన ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. అనంతరం విగ్రహానికి అనుమతి కోరిన రెండు వర్గాలకు చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావు, ఎమ్మెల్యే వర్గానికి చెందిన కౌన్సిల్ సభ్యులు, మరికొందరు ఆర్డీఓ కార్యాలయంలో హాజరయ్యారు. రెండు వర్గాలతో సుదీర్ఘంగా సమావేశం నిర్వహించిన జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ విగ్రహ అనుమతికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై పార్టీ నేతలకు వివరించారు. ఇదే క్రమంలో విగ్రహానికి అనుమతి తప్పనిసరిగా స్థానికంగా ఉన్న మున్సిపల్ కౌన్సిల్ నుంచి ఆమోదం తీసుకోవాలన్నారు. జిల్లాలో విగ్రహాలు ఏర్పాటు చేసే క్రమంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకూడదన్నారు. చట్టవిరుద్ధంగా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ నిర్వహించిన సమావేశం మధ్యలో ఉండగానే.. పెద్దగా కేకలేసుకుంటూ మాజీ మంత్రి పాలేటి రామారావు బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే వర్గానికి చెందిన టీడీపీ నేతలకు ఎటువంటి అభ్యంతరం లేదని జేసీ ముందు ఒప్పుకున్నారని.. వారి అభ్యంతరం కేవలం విగ్రహ ఎత్తు కోసమేనంటూ చెప్పుకొచ్చారు. విగ్రహ ఎత్తు మాత్రమే సమస్య అయితే ఎత్తు పెంచి నిర్మిద్దామని చెప్పామన్నారు. విగ్రహ నిర్మాణం తాను కట్టించడం ఇబ్బంది అయితే ఎమ్మెల్యే వర్గమైనా నిర్మిస్తే తాను సహకరిస్తానన్నారు. అయితే రాజకీయాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు వైఎస్సార్ విగ్రహం సమీపంలోనే ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పాలని, వేరేచోట నిర్మిస్తే తాను ఒప్పుకోనన్నారు. తాము నెలకొల్పే ఎన్టీఆర్ విగ్రహానికి అనుమతులు పేరుతో ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే తాను ఊరుకోనన్నారు. డివైడర్లపై విగ్రహాలు ఉంచకూడదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలా అయితే గతంలో డివైడర్లపై ఉన్న విగ్రహాలకు కూడా అనుమతులు చూపించాలన్నారు. తాను బాపట్ల ఎంపీతో సన్నిహితంగా ఉంటూ ఎంపీ చెప్పినట్లు చేస్తున్నానని అనడానికి సంబంధం లేదన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తి చైర్మన్‌గా ఉన్నారని, చైర్మన్ లేకపోవడంతో ప్రొటోకాల్ ప్రకారం ఇన్‌చార్జి చైర్మన్ హోదాలో వైస్ చైర్మన్‌ను పిలిచామన్నారు. ప్రొటోకాల్ ప్రకారం మాత్రమే పిలిచామని, ఇందులో ఎటువంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పాలేటి రామారావు

కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలో చేర్చవద్దు



కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

- ప్రకాశం, నెల్లూరు జిల్లాల కక్షిదారులకు వ్యయప్రయాసలు
- చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు

చీరాల రూరల్: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయబోయే కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలో నుంచి ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మినహాయించాలని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయని కక్షిదారులకు న్యాయవాదులకు ఎంతో అనుకూలంగా అమరావతిలోని హైకోర్టు ఉంటుందని తెలిపారు. దీనివల్ల సమయంతోపాటు డబ్బు కూడా కక్షిదారులకు ఆదా అవుతుందన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయనున్న కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలోకి చేర్చితే కక్షిదారులు, న్యాయవాదులు చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని తెలిపారు. కర్నూలు వెళ్లేందుకు కక్షిదారులు అధికంగా ఖర్చులు అవుతాయని..కక్షిదారులకు ఖర్చులు భరించే ఆర్థిక స్తోమత ఉండదని చెప్పారు. అంతేకాక కర్నూలు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు కూడా సక్రమంగా లేవన్నారు. న్యాయవాదులు మాగంటి జ్ఞానేశ్వరరావు, బూదరాజు శశికిరణ్, ఆసాది రామకృష్ణారెడ్డి, పరిశబోయిన తులసీరామ్, మోపూరి తారక రామారావు, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ తగ్గేలా చర్యలు చేపట్టాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మండలంలోని రామిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మక్కెనవారిపాలెం ఉన్నత పాఠశాలలో 20 శాతం గైర్హాజరుగా గుర్తించారు. పాఠశాలలో డ్రాపౌట్స్ తగ్గేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం 50 మంది తింటుండగా రికార్డులో 200 మంది అని రాయటంతో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాగి పిండి ప్యాకెట్లను అవుట్‌డేటెడ్ స్టాక్‌గా గుర్తించారు. 300 మంది విద్యార్థులుంటే అతితక్కువ ఎండీఎం తీసుకుంటున్నారని.. నమోదు ఎక్కువ చూపిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ నిర్వహణ సంబంధించిన రికార్డులు పరిశీలించి అవి సక్రమంగా లేకపోడంతో వెంటనే మెమో ఇవ్వాలని ఎంఈవో, డీఈవోలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలన్నారు. ఎస్‌డబ్ల్యూ వీరంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

చీటింగ్ కేసులో నిందితుడు లొంగుబాటు

భాగస్వామ్యం పేరుతో రూ.1.91 కోట్ల మేరకు మోసం

నరసరావుపేట టౌన్: సుమారు రూ.1.91 కోట్లు చీటింగ్ చేసిన కేసులో నిందితుడైన మహేశ్వరి, మాతృశ్రీ మెడికల్ కార్పొరేషన్స్ నిర్వాహకుడు చందోలు వెంకట నరసింహారావు అలియాస్ రాంబాబు శుక్రవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం...

పట్టణంలోని పాతూరుకు చెందిన మేళ్లచెరువు సాంబశివ శాస్త్రి అర్చకులు. ఈయనకు రాంబాబుతో పరిచయం ఉంది. మెడికల్ షాప్ నిర్వహిస్తున్నానని, లాభాలు బాగా వస్తాయని రాంబాబు నమ్మబలికాడు. వాటా ఇస్తానని రూ.41 లక్షలను తీసుకున్నాడు. ఇద్దరు కలిసి వ్యాపారం చేశారు. బ్యాంకు లోన్ కోసం సంతకాలు తీసుకొని సాంబశివ శాస్త్రి ఇంటిపై రాంబాబు రూ.1.5 కోట్ల రుణం పొందాడు. ఆ మొత్తాన్ని మహేశ్వరి మెడికల్ కార్పొరేషన్‌కు ఇచ్చాడు. సాంబశివ శాస్త్రికి తెలియకుండా సంస్థ భాగస్వామ్యం నుంచి తప్పించాడు. రూ. 1.90 కోట్ల మేరకు మోసపోయినట్లు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో గత ఏడాది జూలై 10వ తేదీన బాధితుడు ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్న క్రమంలో రాంబాబు అజ్ఞాతంలోకి వెళ్లాడు. తన న్యాయవాది ద్వారా కోర్టులో లొంగిపోవటంతో న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

నూజిళ్లపల్లి పీఏసీఎస్ విధులు దుర్వినియోగం వ్యవహారంలో..

జె.పంగులూరు: పంగులూరు మండలం నూజిళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నిధులు దుర్వినియోగంపై తొమ్మిది మందిపై కేసు నమోదైంది. జిల్లా కోపరేటివ్ అధికారి సీహెచ్ శ్యాంసన్ ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.వినోద్‌బాబు తెలిపారు. ఈ నిధులు దుర్వినియోగం అయినట్లు 2022లోనే గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు పీఏసీఎస్‌ని నియమించి, 51 ఎంక్వయిరీ నిర్వహించారు. దీర్ఘకాలంగా సాగిన ఈ విచారణలో పీఏసీఎస్‌లో పనిచేసిన ఉద్యోగులు చట్ట విరుద్ధంగా ప్రయివేటు వ్యక్తుల ఖాతాల్లోకి నిధులు మళ్లించి దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణాధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో తొమ్మిది మంది భాగస్వాములను చేస్తూ విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. నాటి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన పెంట్యాల భద్రయ్య, త్రీమాన్ కమిటీ సభ్యులు కొండ్రగుంట రవిబాబు, నాటి సీఈఓ అద్దంకి రవీంద్రబాబు, అటెండర్ చెరుకూరి వెంకట శివప్రసాద్ తోపాటు, మద్దినేని సుబ్బరామయ్య, మద్దినేని నాగరాజకుమారి, చంద్రశేఖర్, కొల్లి సుబ్బయ్య, పోతురాజులపై డీసీఓ శ్యాంసాన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు విచారణ చేస్తున్నారు.



నూజిళ్లపల్లి పీఏసీఎస్ భవనం

వేగేశన దాడి కేసు మంగళగిరి కోర్టుకు బదిలీ

బాపట్ల: బాపట్ల మండలం అడవిపంచాయతీ పరిధిలో 2017లో బొంతా సుబ్బారావుపై ప్రస్తుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు దాడి చేశారనే కేసు విచారణను మంగళగిరి కోర్టుకు బదిలీ చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వివరాలు పరిశీలిస్తే సుబ్బారావుపై వేగేశన నరేంద్రవర్మరాజు దాడి చేశారని సి.సి.464/2017లో కేసు నమోదైంది. ఈకేసు గతేడాది డిసెంబరులో విచారణ జరగగా సాక్ష్యం చెప్పేందుకు బొంతా సుబ్బారావుకు కొన్ని ఆటంకాలు ఎదురుకావటంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈకేసు విచారణను మరో కోర్టుకు అప్పగించాల్సిందిగా కోరగా హైకోర్టు కేసును మంగళగిరి కోర్టును కేటాయిస్తూ శుక్రవారం సూచించింది. ఈమేరకు బొంతా సుబ్బారావు తరపున హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు వాదిస్తున్నారు.

పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

గుంటూరుఎడ్యుకేషన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఈపీఎస్, ఎఫ్‌పీఎస్- 1971 పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలను సమర్పించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పెన్షనర్లు తమ జీవన ప్రమాణ పత్రాన్ని ఏడాది వ్యవధి ముగిసేలోపు మరుసటి ఏడాదికి ముందస్తుగా సమర్పించాలని, అందుకు వివిధ పద్ధతులు అమల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. పెన్షన్ పొందుతున్న బ్యాంకు, మీ-సేవా, పీఎఫ్ కార్యాలయంతోపాటు పోస్ట్ ఇన్ఫోయాప్ ద్వారా తమ అభ్యర్థన నమోదుచేసిన పక్షంలో పోస్టుమేన్ ఇంటికి వచ్చి వేలిముద్ర, ఐరిష్ స్కాన్ ద్వారా జీవన ప్రమాణ పత్రాన్ని స్వీకరిస్తారని తెలిపారు. మూడేళ్లకు పైబడి పెన్షన్ పొందని వారు గుంటూరు కృష్ణనగర్‌లోని పీఎఫ్ కార్యాలయానికి రావాలని సూచించారు.

ఎస్సీ లబ్ధిదారులకు న్యాయం చేయాలి



కారంచేడు తహసీల్దార్ నాగరాజుకు అర్జీ ఇస్తున్న ఎస్సీ నాయకుడు నాగేంద్ర

కారంచేడు: కారంచేడు రెవెన్యూ సర్వే నంబర్ 1228, 1229లో ప్రభుత్వం ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం కింద ఎస్సీలకు ఇచ్చిన భూములను అర్హులైన లబ్ధిదారులు అనుభవించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ నాయకులు శుక్రవారం తహసీల్దారు జి.నాగరాజుకు అర్జీ ఇచ్చారు. 2005వ సంవత్సరంలో 13 మంది ఎస్సీలకు 47 సెంట్లు చొప్పున భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. 2010లో చీరాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఎస్సీ కార్పొరేషన్ తనఖాలో ఉన్న భూములను అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. 2024లో ప్రభుత్వం ఇచ్చిన 51 జీఓ ప్రకారం ఆ భూములను లబ్ధిదారులకు ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్నారు. అన్యాక్రాంతమైన భూములను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాకుమాను రవి, గొర్రెముచ్చు ఏలియా పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

జూనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్ల జతకు ప్రథమస్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన వేటపాలెం ఆర్‌కే బుల్స్

నాదెండ్ల:గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన ఈ పోటీలు రసవత్తరంగా జరిగాయి. చివరిరోజు జూనియర్స్ విభాగంలో 10 జతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణచౌదరి, వేగనాటి ఒసూరారెడ్డి ఎడ్ల జత 3250 అడుగుల దూరం లాగి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. కడప జిల్లా పొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన పెరుమాళ్ల శివకృష్ణయాదవ్ జత 3060 అడుగుల దూరంతో రెండోస్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లా బావులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌కు చెందిన నందతేజ డెయిరీఫామ్స్ కేతినీడి తేజోమూర్తి ఎడ్ల జత 2828 అడుగుల దూరం లాగి మూడో స్థానం పొందింది. చుండూరు మండలం వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత 2568 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలెంకు చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జత 2500 అడుగుల దూరంలో ఐదోస్థానంలో, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన ఆలా మోహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు ఎడ్ల జత 2365 అడుగుల దూరంతో ఆరో స్థానంలో, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిమర్రుకు చెందిన ఎర్రసాని సుబ్బయ్య ఎడ్ల జత 2250 అడుగుల దూరంతో ఏడో స్థానంలో, గుంటూరు పట్టణానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత 2060 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడుకు చెందిన కళ్లం శివారెడ్డి ఎడ్ల జత 1250 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో, పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెంకు చెందిన గోపాళం శివసాగర్‌చౌదరి ఎడ్ల జత 1217 అడుగుల దూరం లాగి పదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల యజమానులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దాతల చేతుల మీదుగా నగదు, షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆరురోజుల పాటూ జరిగిన పోటీలకు తంగెడ హసన్, గూడ శ్రీనివాసరావులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

ట్రాక్టర్‌ను లారీ ఢీకొని ఒకరు మృతి



ప్రమాదస్థలంలో ధ్వంసమైన వాహనాలు



మస్తాన్ (ఫైల్)

నకరికల్లు: ఓ ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శిశుమందిర్ సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ కథనం ప్రకారం.. నకరికల్లుకు చెందిన అనువుల మస్తాన్ (47) బ్రిక్స్ కంపెనీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బ్రిక్స్ మెటీరియల్ కోసం శుక్రవారం గుండ్లపల్లి వెళ్తూ ఒకరిని ఎక్కించుకునేందుకు రోడ్డు మార్జిన్‌లో ట్రాక్టర్ నిలిపాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. లారీ, ట్రాక్టర్ నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్ అనువుల మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న వ్యక్తి బత్తిన వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

క్రీడలకు ఎంపికైన ఉద్యోగులకు నగదు ప్రోత్సాహం



లక్ష్మీపురం: హైదరాబాద్‌లో ఈనెల 11 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సెంట్రల్ రెవెన్యూ ఆఫీసర్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్‌కు గుంటూరు సెంట్రల్ జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఐదుగురు ఉద్యోగులు ఎంపికయ్యారు. శుక్రవారం కన్నవారితోటలోని జీఎస్‌టీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అభినందించడంతోపాటు ఒక్కొక్కరికి ఐదు వేలు చొప్పున అందజేశారు. ఉద్యోగులు క్రీడలలో మరింత రాణించి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన ఉద్యోగులు కాకర్ల శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, పి.వెంకటాచలం, పి.వెంకటేశ్వర్లు, బి.ప్రశాంత్‌కుమార్ అసిస్టెంట్ కమిషనర్ (స్పోర్ట్స్ ఆఫీసర్) ఎం.నాగరాజు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో ఇసుకకు కొలతలు



కొలతలు వేస్తున్న భూగర్భ గనుల శాఖ సర్వేయర్ సీతమ్మ

కొల్లిపర: మండలంలోని మున్నంగి, బొమ్మువానిపాలెం 14, 15 ఇసుక రీచుల నుంచి నిన్నటి వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి పొందిన కంపెనీల కాలపరిమితి ముగిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం యార్డులో నిల్వ ఉన్న ఇసుక వివరాలను నమోదు చేస్తున్నామని భూగర్భ గనుల శాఖ సర్వేయర్ సీతమ్మ తెలిపారు. వివరాలతో సోమవారం ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీర్వో రామారావు, భాస్కర్, ఆయా కంపెనీల ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సాయి సాధన చిట్‌ఫండ్‌లో కొనసాగిన తనిఖీలు

- నిందితుడు పుల్లారావు వ్యాపార కార్యకలాపాలపై ఆరా
- రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల సేకరణ
- 50కి చేరిన బాధితుల సంఖ్య

నరసరావుపేట టౌన్: సాయిసాధన చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్‌లో సోదాలు రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. పల్నాడు రోడ్డులోని చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు రూ.కోట్లతో ఉడాయించి గురువారం గుంటూరు కోర్టులో లొంగిపోయిన విషయం విదితమే. నిందితుడు కోర్టులో సరెండర్ కావటంతో అప్రమత్తమైన వన్‌టౌన్ పోలీసులు కార్యాలయంలో దాడులు నిర్వహించారు. గురువారం సాయంత్రం మొదలైన తనిఖీలు శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగాయి. చీటీపాటలు, డిపాజిట్లకు సంబంధించి రికార్డులను పరిశీలించి ఖాతాదారుల వివరాలను సేకరించారు. మొత్తం బాధితులు ఎంత మంది, ఎంత మేర కట్టి నష్టపోయారన్నది లెక్కిస్తున్నారు. మరోవైపు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పుల్లారావు గత నాలుగు నెలలుగా జరిపిన క్రయవిక్రయాల సమాచారాన్ని సేకరించారు. సుమారు 80 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నకళ్లను కార్యాలయం నుంచి తీసుకున్నారు. సాయిసాధన చిట్‌ఫండ్‌కు సంబంధించి నిర్వహించే చిట్ రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 43 మంది బాధితులు ఫిర్యాదు చేయగా, శుక్రవారం మరో ఏడుగురు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

పీటీ వారెంట్‌పై నరసరావుపేటకు..

పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో రియల్ ఎస్టేట్ పేరుతో చేసిన మోసంపై నమోదైన కేసులో ప్రధాన నిందితుడు పాలడుగు పుల్లారావు గురువారం గుంటూరు న్యాయస్థానంలో లొంగిపోయాడు. దీంతో అతనికి రిమాండ్ విధించటంతో జిల్లా జైలుకు తరలించారు. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటీపాటల స్కాంకు సంబంధించి కేసు నమోదు కావడంతో ఆ కేసులో పుల్లారావును పీటీ వారెంట్‌పై నరసరావుపేట స్టేషన్‌కు తీసుకురానున్నారు. ఈ విషయంపై సీఐ విజయ్‌చరణ్ మాట్లాడుతూ సోమవారం కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేసి న్యాయమూర్తి అనుమతితో సబ్‌జైలులో ఉన్న నిందితుడిని విచారణ కోసం తీసుకొస్తామని పేర్కొన్నారు.